క్లుప్తంగా

ప్రజలకు సేవలు అందించాలి

● ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్



జిల్లా పదవులు పొందిన వారిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే తాటిపర్తి

యర్రగొండపాలెం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి తమపై ఉన్న నమ్మకంతో పార్టీలో ఉన్న కీలక పదవులు నియోజకవర్గానికి కేటాయించారని, ఆయన సూచనల మేరకు పార్టీతోపాటు ప్రజలకు సేవలు అందించాలని, తమ పదవులకు న్యాయం చేకూర్చాలని ఎమ్మెల్యే, ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి తాటిపర్తి చంద్రశేఖర్ అన్నారు. జిల్లా పదవులు అలంకరించిన ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు పి.రాములునాయక్, ఇంటిలెక్చువల్ శాఖ జిల్లా అధ్యక్షుడు అంగిరేకుల ఆదినారాయణ, సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ వెన్నా కృష్ణారెడ్డిలకు మంగళవారం ఆయన శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో జిల్లా స్థాయితోపాటు రాష్ట్ర స్థాయి పదవులు పొందిన వారు ఉన్నారని, ఇంకా ఎన్నో పదవులు ఉన్నాయని, కార్యకర్తలకు ఆ పదవులు వచ్చేందుకు తన వంతు కృషి చేస్తానని చెప్పారు. పదవులు పొందినవారు విస్తృతంగా పర్యటించి తమ పదవులకు న్యాయం చేయాలని, పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులతో సఖ్యత పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ఎస్.పోలిరెడ్డి, పి.కృష్ణారెడ్డి, రాచగొర్ల పిచ్చయ్య, షేక్.బుజ్జి పాల్గొన్నారు.

ఘనంగా నగర సంకీర్తన



నూతన పల్లకిలో రాములవారి నగర సంకీర్తన

పుల్లలచెరువు: ధనుర్మాసం సందర్భంగా మండల కేంద్రంలో ఘనంగా నగర సంకీర్తనను మంగళవారం నిర్వహించారు. ధనుర్మాసం సందర్భంగా నెల రోజుల పాటు ప్రతి రోజు ఉదయం రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించే వారు. ఈ సందర్భంగా భక్తులు అభిషేకాలు నిర్వహించి దద్దోజనం ను భక్తులకు పంపిణీ చేస్తారు. మాసం చివరి రోజు కావడంతో రామాలయంలోని ఉత్సవ విగ్రహాలను నూతన పల్లకిలో మోసుకుని భక్తులు గ్రామ వీధుల గుండా భజనలు, పాటలు పాడుకుంటూ ఊరేగింపు నిర్వహించారు. పుల్లలచెరువుకు చెందిన గోపవరపు సత్యనారాయణ కుటుంబ సభ్యులు రూ.50 వేలు విలువైన నూతన పల్లకిని స్వామి వారికి బహూకరించారు.

ఎంబీబీఎస్ సీటు సాధించిన పేద విద్యార్థికి ఆర్థిక సాయం



పేద విద్యార్థికి ఆర్థిక సహాయం అందిస్తున్న ఎస్టీ నాయకులు

పెద్దదోర్నాల: ఎంబీబీఎస్ సీటు సాధించిన పేద విద్యార్థికి జిల్లా ఎస్టీ యూనియన్ నాయకులు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. మండల పరిధిలోని చిలకచర్ల గ్రామానికి చెందిన లోకేష్ నాయక్ ఇటీవల ఎంబీబీఎస్ సీటు సాధించాడు. ఈ నేపథ్యంలో బుధవారం స్థానిక ఎస్టీ నాయకులు గాలేనాయక్‌తో పాటు మార్కాపురం ఎంఈఓ రాందాస్‌నాయక్, మోహంతునాయక్, కేకే నాయక్, అంబానాయక్, బాలాజీ నాయక్ తదితరులు నిరుపేద విద్యార్థి లోకేష్‌నాయక్‌ను కలిసి రూ.15 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు.

యోగితాత ఆరాధనోత్సవాలకు సర్వం సిద్ధం

కురిచేడు: మండలంలోని పొట్లపాడు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ గుత్తికొండ రామయోగితాత ఆరాధనోత్సవాలకు సర్వం సిద్ధం చేశారు. గురువారం నుంచి ప్రారంభమయ్యే ఈ ఉత్సవాలకు రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో హాజరవుతారని అంచనా వేసి అధికారులు ఏర్పాట్లు చేశారు. స్వామివారి మఠానికి రంగులు వేయించి భక్తుల సౌకర్యార్థం తాగు నీరు, అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. రాత్రికి మూడు విద్యుత్ ప్రభలు నిర్మించి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. కులమతాలకతీతంగా రామయోగి తాత అరాధనోత్సవాలు జరుపుకునేందుకు ప్రజలు సిద్ధమయ్యారు.



రామయోగితాత ఉత్సవమూర్తి



శ్రీ గుత్తికొండ రామయోగితాత మఠం

ఘనంగా సంక్రాంతి సంబరాలు

● దర్శిలో వేడుకల్లో పాల్గొన్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి



దర్శిలో సంక్రాంతి వేడుకల్లో దివ్యాంగ కళాకారులతో బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, బూచేపల్లి వెంకాయమ్మ



క్రికెట్ విజేతలకు బహుమతులు అందజేస్తున్న బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి

దర్శి:

దర్శి నియోజకవర్గంలో సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. దర్శిలో నిర్వహించిన వేడుకల్లో స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ పాల్గొన్నారు. స్థానిక రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి పల్లకి సేవలో శ్రీకోదండ రామాంజనేయస్వామి పల్లకిని భుజంపై ఎత్తుకుని మోశారు. పొదిలి రోడ్డులో 24 మినీబాక్స్ క్రికెట్ టోర్నమెంట్‌లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. అక్కడ క్రికెట్ ఆడి యువకులను ఉత్సాహపరిచారు. దర్శిలో జరిగిన కళాంజలి ఈవెంట్స్ ఆధ్వర్యంలో జబర్దస్త్‌లో రాకెట్ రాఘవ టీం సందడి చేసింది. విద్యార్థినులు నిర్వహించిన భరతనాట్య ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. దివ్యాంగుల డ్యాన్స్ పోటీలు అబ్బురపరిచాయి. సంక్రాంతి సంబరాల్లో భాగంగా మంచి కార్యక్రమాలు నిర్వహించిన కళాంజలి ఈవెంట్స్ తరఫున జబర్దస్త్ టీంకు రూ.2 లక్షలు బహూకరించారు. కళాకారులందరూ బూచేపల్లి వెంకాయమ్మ, శివప్రసాద్‌రెడ్డిని పరిచయం చేసుకుని సెల్ఫీలు దిగి తమ అనుభవాలను వారితో పంచుకున్నారు. ఈ సందర్భంగా బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, బూచేపల్లి వెంకాయమ్మ మాట్లాడుతూ సంక్రాంతి సందర్భంగా కళాకారులు దర్శి వచ్చి మంచి కార్యక్రమాలు నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. చిన్నారులు చేసిన నృత్యాలు అబ్బురపరిచాయని చెప్పారు. రాకెట్ రాఘవ తమ ఐదు సినిమాల్లో నటించారని, వారి కుటుంబానికి మాకు ఎప్పటి నుంచో మంచి అనుబంధం ఉందని అన్నారు. అందరూ పండుగను సంతోషంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. రాకెట్ రాఘవ మాట్లాడుతూ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, వెంకాయమ్మను కలవడం తమకెంతో ఆనందంగా ఉందన్నారు. తమకు సినిమాల్లో మంచి అవకాశాలు ఇచ్చి ఆదరించారన్నారు. సినీ హీరో దివంగత బూచేపల్లి కమలాకర్‌రెడ్డి ఎంతో మంచి వ్యక్తి అని కొనియాడారు.



అయ్యప్పస్వామి ఉత్సవ విగ్రహానికి ఊరేగింపు నిర్వహిస్తున్న దృశ్యం

సంక్రాంతి సందర్భంగా ముగ్గుల పోటీలు...

దొనకొండ: స్థానిక విజయాంజనేయస్వామి దేవాలయంలో సంక్రాంతి పండుగ సందర్భంగా ఆలయ ధర్మకర్త శిరిగిరెడ్డి బాలిరెడ్డి ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి 132 మంది మహిళలు పాల్గొన్నారు. మొదటి బహుమతి సాధించిన సాయి లిఖితకు అన్నారెడ్డి వెంకటేశ్వరరెడ్డి కుట్టు మిషన్ అందజేశారు. రెండో బహుమతి సాధించిన టి.నిహారికకు డా.బెల్లంకొండ షెమిల్ గ్రైండర్ బహూకరించారు. మూడో బహుమతిగా పి.బిందుకు బత్తుల బ్రహ్మయ్య డ్రెస్సింగ్ టేబుల్ అందజేశారు. నాలుగో బహుమతిగా బి.వసుంధరకు మిక్సీని అచ్యుత శ్రీధర్ అందజేశారు. ఐదో బహుమతిగా కావేరికి కుక్కర్‌ను అబ్దుల్ షాదిక్ అందజేశారు. ముగ్గుల పోటీల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ కన్సొలేషన్ బహుమతులు, బిందెలు, చీరలు అందజేశారు. ముఖ్య అతిథులుగా వెన్నా సుశీల, మచ్చు రమణ, ఎస్ఐ కె.విజయ్‌కుమార్ పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు. ముగ్గుల పోటీలు తిలకించడానికి విచ్చేసిన వారందరికీ ధర్మకర్త బాలిరెడ్డి అన్నదానం చేశారు.

చందవరంలో...

దొనకొండ మండలంలోని చందవరం గ్రామంలో శివాలయం గుడి వద్ద సంక్రాంతి పండుగ సందర్భంగా గ్రామ పెద్దలు, యువజన అభివృద్ధి, సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను పులిపాటి వెంకట నారాయణ ధర్మపత్ని ప్రభావతి ఆర్థిక సహకారంతో నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. గెలుపొందిన మహిళలకు మొదటి నాలుగు బహుమతులుగా గ్రైండర్, మిక్సీ, రైస్ కుక్కర్, ప్రెజర్ కుక్కర్ అందజేశారు. దాతలను గ్రామస్తులు, యువజన అభివృద్ధి సంఘం వారు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎగ్గోని యల్లారెడ్డి, బీఎస్ రాజు, బత్తుల వెంకటేశ్వర్లు, పిల్లి ఓబులరెడ్డి, ఎగ్గోని వెంకటేశ్వరరెడ్డి, వై.నాగేశ్వరరావు, గుంటూరు వెంకటేశ్వర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆనంద ఆశ్రమంలో...

దొనకొండలోని ఆనంద ఆశ్రమంలో సంక్రాంతి, కనుమ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆశ్రమ ఉత్తర ద్వారం పక్కన వెలసిన పోలేరమ్మకు అభిషేకాలు, కుంకుమ పూజలు నిర్వహించి అమ్మ వారికి సద్ది నైవేద్యాలు సమర్పించారు. హారతులిచ్చారు. అనంతరం గోశాలలో గోవులను పూజించారు. ప్రతి ఇంటా గోవు ఉండాలని, ప్రతిఒక్కరూ పెంచాలని భైరవానందస్వామి కోరారు.

అలరించిన కోలాటం...

తాళ్లూరు: సంక్రాంతి పండుగ సందర్భంగా మండలంలోని బొద్దుకూరపాడు గ్రామంలో మహిళలు, బాలికలు సంప్రదాయబద్ధమైన కోలాటాన్ని ప్రదర్శించి అలరించారు. మాస్టర్ మామిడి శివశంకర్ శిక్షణలో కోలాట ప్రదర్శన ఎంతగానో ఆకట్టుకుంది. పలు గ్రామాల నుంచి అధిక సంఖ్యలో వచ్చి కోలాటాన్ని తిలకించారు. మాస్టర్ శివశంకర్‌ను గ్రామస్తులు, కోలాటం బృందం పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు.

సాంప్రదాయాలకు ప్రతీక సంక్రాంతి

పెద్దారవీడు: సంస్కృతీ సాంప్రదాయాలకు ప్రతీక మకర సంక్రాంతి పండుగను గ్రామాల్లో ప్రజలు భక్తిశ్రద్ధలతో మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. ప్రతి ఇంటి లోగిలిలో రంగవల్లులు తీర్చిదిద్ది సంక్రాంతి లక్ష్మిని మహిళలు స్వాగతించారు. రాజంపల్లి గ్రామం సమీపంలో రాజ్యలక్ష్మి సమేత గొడ్రాలికొండ తిరుమలనాథస్వామి, రామాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి కాయ కర్పూరం సమర్పించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. బుధవారం కనుమ పండుగ సందర్భంగా రైతులు భక్తిశ్రద్ధలతో గోవులు, ఎద్దులను పసుపు, కుంకుమలతో పూజించి నమస్కరించుకున్నారు. పాడి పశువులు, సుఖశాంతులతో ఉండాలని ప్రజలు కోరుకున్నారు.

వైభవంగా సంక్రాంతి పర్వదినం

పెద్దదోర్నాల: సంక్రాంతి, కనుమ పర్వదినాలను మండల ప్రజలు అత్యంత భక్తి శ్రద్ధలతో, ఆనందోత్సవాల నడుమ జరుపుకున్నారు. భోగి పండుగతో ప్రారంభమై మకర సంక్రాంతి, కనుమ పర్వదినాలు వైభవంగా నిర్వహించారు. వివిధ ఆలయాల్లో నిర్వహించిన ప్రత్యేక పూజలు, పార్వేట ఉత్సవాలు, నగరోత్సవాలు కన్నుల పండువగా జరిగాయి. పలు దేవాలయాల్లో ఆధ్యాత్మిక కార్యక్రమాలు, హరిదాసుల హరినామస్మరణ కీర్తనలు ఆకట్టుకున్నాయి. స్థానిక శ్రీలక్ష్మీ నరసింహస్వామి దేవస్థానంలో స్వామి వారి మూలవిరాట్‌కు విశేష పూజలు నిర్వహించారు. ఇంటి ముందు రంగు రంగుల రంగవల్లికలతో ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. డూడూ బసన్నల విన్యాసాలు, హరిదాసుల హరినామస్మరణ కీర్తనలు, నృత్యాలతో అలరించాయి. సంక్రాంతి పెద్దల పండుగ కావటంతో పితృదేవతలకు తిలార్పణం వదిలారు. నువ్వులను కలిపిన బిక్కిలాలు, అరిసెలు వంటి పిండి వంటలను చేసి బంధు మిత్రులకు పంచిపెట్టారు. సంక్రాంతిలో భాగంగా మూడో రోజైన కనుమ పండుగ సందర్భంగా పశుసంపదను అలంకరించి పొంగలిని వండారు. ముందుగా ఇంటి దేవతలకు నైవేద్యం పెట్టిన తరువాత ఆ పొంగలిని పొలాల్లో చల్లితే ఆ ఏడాది అంతా రెట్టింపు దిగుబడులు వస్తాయన్న విశ్వాసంతో రైతులు ఈ పోలిపొంగలిని పసుపు, కుంకుమలతో కలిపి చల్లారు. ప్రసిద్ధి గాంచిన స్థానిక అయ్యప్ప దేవాలయంలో భక్తులు అశేషంగా పాల్గొని కర్పూర జ్యోతిని భక్తి శ్రద్ధలతో దర్శించుకున్నారు. అయ్యప్ప స్వామి ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో పురవీధుల గుండా భారీ ఊరేగింపు నిర్వహించారు.



రాజంపల్లిలో ప్రత్యేక అలంకారంలో తిరుమలనాథస్వామి



దొనకొండలోని ఆనంద ఆశ్రమంలో పోలేరమ్మకు పూజలు చేస్తున్న భక్తులు



దొనకొండలో ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎస్ఐ



బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, బూచేపల్లి వెంకాయమ్మతో రాకెట్ రాఘవ



దర్శిలో సంక్రాంతి వేడుకల్లో మాట్లాడుతున్న బూచేపల్లి



బొద్దుకూరపాడులో కోలాటం ఆడుతున్న మహిళలు, బాలికలు



చందవరంలో ముగ్గుల పోటీలకు సహకరించిన దాతలను సన్మానిస్తున్న గ్రామస్తులు

రసవత్తరంగా క్రికెట్ టోర్నమెంట్

యర్రగొండపాలెం: ఎమ్మెల్యే, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి తాటిపర్తి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో జరుగుతున్న టీసీఆర్ క్రికెట్ టోర్నమెంట్ రసవత్తరంగా సాగుతోంది. అనూహ్యంగా 70 టీంలు పాల్గొనడంతో ముందుగా ఎంపిక చేసిన గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల ఆట స్థలం సరిపోలేదు. మంగళవారం స్థానిక పుల్లలచెరువు రోడ్డులోని బృందావన గార్డెన్స్ ఆవరణలో రెండో ఆటస్థలాన్ని ఏర్పాటు చేశారు. రెండు ప్రాంతాల్లో పోటీలు ముమ్మరంగా సాగుతున్నాయి. టోర్నమెంట్ జరిగే సమయంలో ఆయా ప్రాంతాల నుంచి వచ్చిన వీక్షకులు క్రీడాకారులను ప్రోత్సహించారు. అందులో భాగంగా సిక్స్‌కొట్టు ఐదొందలు పట్టు అంటూ ఎస్ఎంఆర్‌అండ్ సన్స్ సొసైటీ అధ్యక్షుడు సయ్యద్ జబీవుల్లా ప్రకటించడంతో క్రీడాకారులు విజృంభించి 40 సిక్స్‌లు కొట్టారు. వెంటనే ఆ నగదు ప్రోత్సాహకాన్ని ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ చేతుల మీదుగా వారు అందుకున్నారు. మూడు రోజులుగా సాగుతున్న క్రికెట్ టోర్నమెంట్‌లో 27 మ్యాచ్‌లు జరిగాయి. వారిలో తిరుమలగిరి కాలనీ-2, బనముక్కల, రేగుమానిపల్లె, మురారిపల్లె, ఏబీఎం ఇజ్రాయిల్‌పేట, తోకపల్లి, ఐటీవరం, గణపవరం, తిరుమలగిరి కాలనీ-1, గారపెంట, దోర్నాల టీసీఆర్ టీం, పుల్లలచెరువు-1, రామసముద్రం, జమ్మిదోర్నాల, ముడివేముల, ఇందిరానగర్, దూపాడు, నాయుడుపాలెం, కంభంపాడు, విక్టరిబాయిస్, మంత్రూస్వామి, దోర్నాల ఏబీఎం, పుచ్చకాయలపల్లి, వసంత, గంగవరం, తంగిరాలపల్లె, పెద్దారవీడు టీంలు విజేతలుగా ముందుకు సాగుతున్నారు. మ్యాన్‌ఆఫ్ మ్యాచ్‌గా అంజిరెడ్డి, సుకుమార్, రాము, సుధాకర్‌రెడ్డి, చైతన్య, నాగేశ్వరరావు, అనిల్, శ్రీను, మహేష్, పోలు, అన్సారి, శాంసన్, రాకేష్, రాజశేఖరరెడ్డి, బాలకుమార్, మంత్రూనాయక్, నాగార్జున, కాశి, రవి, గురు, సాయిలు నిలిచారు. ఆయా ఆట స్థలాల్లో క్రీడల నిర్వాహకులుగా నర్రెడ్డి వెంకటరెడ్డి, కొల్లి సత్యనారాయణరెడ్డి, కందుల సుబ్బారెడ్డి, హనుమానాయక్, గంజి చెన్నారెడ్డి, కె.సుందరకుమార్, ఎంపయిర్లుగా హరి, రాము, విల్సన్, వలి, యాసిన్, కాసింవలి, ఇమ్రాన్‌లు వ్యవహరించారు.



బృందావన గార్డెన్స్‌లో జరుగుతున్న క్రికెట్ టోర్నమెంట్

అయ్యప్ప స్వామి ఆలయంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు



ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్

యర్రగొండపాలెం: మకర సంక్రాంతి పండుగ స్థానిక అయ్యప్ప స్వామి ఆలయంలో మంగళవారం ఎమ్మెల్యే, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి తాటిపర్తి చంద్రశేఖర్ ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన ఆలయ ప్రాంగణంలో ప్రదక్షిణలు చేశారు. ముందుగా నిర్వాహకులు ఎమ్మెల్యేకు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఉడుముల శ్రీనివాసరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు కె.ఓబులరెడ్డి, వైస్ ఎంపీపీ మందుల ఆదిశేషు, ఆలయ కమిటీ పెద్దలు కందూరి రామయ్య, కాశీవిశ్వనాథ్, గురుప్రసాద్, ఏకుల మునలారెడ్డి, చిలకల అంకిరెడ్డి, ఆవుల చెంచిరెడ్డి, బిజ్జం రమణారెడ్డి పాల్గొన్నారు.

వైవీ, బూచేపల్లికి నాయకుల సంక్రాంతి శుభాకాంక్షలు



బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, వెంకాయమ్మను సన్మానిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



వైవీ సుబ్బారెడ్డితో వైఎస్సార్ సీపీ తాళ్లూరు మండల నాయకులు

తాళ్లూరు: సంక్రాంతి పండుగ సందర్భంగా వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి వైవీ సుబ్బారెడ్డి, జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మను ఆ పార్టీ తాళ్లూరు మండల నాయకులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. వారిని పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించి బొకేలు అందజేశారు. వారిని కలిసిన వారిలో సర్పంచ్‌ల సంఘ జిల్లా అధ్యక్షుడు మారం ఇంద్రసేనారెడ్డి, నాయకులు కైపు అశోక్‌రెడ్డి, మారం సాయి చరణ్‌రెడ్డి, మాజీ ఎంపీపీ పోశం మధుసూదన్‌రెడ్డి, దర్శి మాజీ చైర్మన్ వెన్నపూస మహేష్, కొండారెడ్డి, గువ్వల శ్రీనివాసరెడ్డి, గ్రామ స్థాయి నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

శ్రీశైలం ఘాట్‌లో ప్రమాదం

● వేగాన్ని అదుపు చేసుకోలేక బోల్తాపడిన కారు

పెద్దదోర్నాల: వేగాన్ని నియంత్రించుకోలేని ఓ కారు అదుపు తప్పి రోడ్డు పక్కనున్న పొదల్లో బోల్తా పడిన ఘటన శ్రీశైలం ఘాట్‌రోడ్డులోని ఇష్టకామేశ్వరి ఆలయ ముఖద్వారం సమీపంలో బుధవారం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో ఏలూరు జిల్లా జంగారెడ్డి గూడేనికి చెందిన ఐదుగురికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రుల కథనం మేరకు జంగారెడ్డి గూడెం నుంచి దైవదర్శనం కోసం శ్రీశైల పుణ్యక్షేత్రానికి బయలు దేరిన ప్రయాణికులతో బయలుదేరిన కారు ఇష్టకామేశ్వరి ఆలయ ముఖద్వారం సమీపంలో అదుపుతప్పి బోల్తా కొట్టడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న వరలక్ష్మి, మహేష్, లక్ష్మి, సింధు, హర్షితలు స్వల్పంగా గాయపడ్డారు. ప్రమాద సమాచారం అందుకున్న 108 సిబ్బంది క్షతగాత్రులను సమీపంలోని శ్రీశైలం ప్రాజెక్టు కాలనీలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించి ప్రథమ చికిత్సలు నిర్వహించారు.



శ్రీశైలం ఘాట్‌లో అదుపు తప్పి బోల్తా పడిన కారు

భక్తిశ్రద్ధలతో మకరజ్యోతి వేడుక

కురిచేడు: స్థానిక దర్శి రోడ్డులోని శ్రీ హరిహరపుత్ర అయ్యప్పస్వామి దేవాలయం వద్ద మకర సంక్రాంతి పర్వదినం సందర్భంగా మంగళవారం అయ్యప్పస్వామి భక్తులు మకరజ్యోతి వెలిగించారు. భక్తుడు తెల్లమేకల వెంకట సుబ్బారావు 27 కిలోల కర్పూరం తెచ్చి అయ్యప్పస్వామి ఆలయం ముందు వెలిగించారు. అయ్యప్పస్వామి భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని అయ్యప్ప నామస్మరణతో జ్యోతిని తిలకించారు. అనంతరం అయ్యప్పస్వామి ఆలయంలో భజన కార్యక్రమం నిర్వహించారు. భక్తులకు ఆలయ కమిటీ అధ్యక్షుడు పి.నాసరయ్య, కమిటీ సభ్యులు తీర్థప్రసాదాల వితరణ చేశారు.

సంక్రాంతికి కలిసిన పూర్వ విద్యార్థులు



పాఠశాలకు సీసీ కెమెరాలు బహూకరిస్తున్న పూర్వ విద్యార్థులు

దర్శి: మండలంలోని చందలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2004-05 సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు సంక్రాంతి పండుగను పురస్కరించుకుని పాఠశాలలో సమ్మేళనం నిర్వహించారు. వారికి ఉత్తమ విద్య అందించిన గురువులైన భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుడు శ్రీనివాసరావు, ఆంగ్ల ఉపాధ్యాయుడు కోటేశ్వరరావు, తెలుగు ఉపాధ్యాయుడు అక్బర్‌ను ఆహ్వానించి దుశ్శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. విద్యార్థులంతా కలిసి పాఠశాలకు సీసీ కెమెరాలు బహుమతిగా అందజేశారు. విద్యార్థులు తమ పాతజ్ఞాపకాలను నెమరువేసుకుని ప్రస్తుతం వారు చేస్తున్న ఉద్యోగాలు, వ్యాపారాలు, ఇతర పనుల గురించి ఒకరికొకరు చెప్పుకున్నారు. కార్యక్రమంలో ప్రస్తుత ఉపాధ్యాయులు పీ వెంకటేశ్వరరెడ్డి, సందు వెంకటేశ్వర్లు, ముక్కు రమణారెడ్డి, రికార్డ్ అసిస్టెంట్ చిట్టే బాలసుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.